వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 324
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
అక్టోబర్ 09, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

# స్థానిక ఎన్నికలకు బ్రేక్



- ఉదయం నోటిఫికేషన్.. మధ్యాహ్నం స్టే
- బీసీ రిజర్వేషన్ల జీవో 9పై వాదోపవాదనలు
- నిలుపుదల చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు
- నాలుగు వారాల్లో కౌంటర్ ధాఖలు చేయాలంటూ ప్రభుత్వానికి ఆదేశం

2లో..






# స్థానిక ఎన్నికలకు బ్రేక్

- ఉదయం నోటిఫికేషన్.. మధ్యాహ్నం స్టే
- బీసీ రిజర్వేషన్ల జీవో 9పై వాదోపవాదనలు
- నిలుపుదల చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు
- నాలుగు వారాల్లో కౌంటర్ ధాఖలు చేయాలంటూ ప్రభుత్వానికి ఆదేశం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9తో పాటు లోకల్ బాడీ ఎన్నికలను నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై స్టే విధించింది. బీసీ రిజర్వేషన్లపై రెండు రోజులపాటు సుదీర్ఘ వాదనలు విన్న న్యాయస్థానం ఎట్టకేలకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ ధాఖలు చేయాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అదే విధంగా పిటిషనర్లకు రెండు వారాల సమయం ఇచ్చింది. బీసీ రిజర్వేషన్లపై తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

**ఉదయం నోటిఫికేషన్..**

రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడంతో నామినేషన్ల పర్వం మొదలైంది. రెండు విడతల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ గురువారం ఉదయం ప్రారంభం కావడంతో కొందరు ఆశావహులు నామినేషన్లు కూడా దాఖలు చేశారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో మధ్యాహ్నం వాదనలు ప్రారంభమయ్యాయి. ఎవరికి వారు వారి వాదనలు వినిపించారు. రెండు రోజుల పాటు జరిగిన వాదనలను పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం బీసీ రిజర్వేషన్ల జీవో 9పై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత న్యాయస్థానం తీసుకోబోయే నిర్ణయంపై స్థానిక సంస్థల ఎన్నికల భవతవ్యం ఆదారపడి ఉంది. హైకోర్టు స్టేతో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు బ్రేక్ పడింది.

**బీసీల్లో నిరాశ..**

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9 పై హైకోర్టు స్టే విధించడంతో బీసీ వర్గాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి. బీసీల తరుపున రెండు రోజుల పాటు సమర్ధవంతంగా వాదనలు వినిపించినప్పటికీ కోర్టు స్టే ఇవ్వడంపై బీసీ వర్గాలు అసహనం వ్యక్తం చేశాయి. హైకోర్టు గేటు ఎదుట బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. బీసీలకు న్యాయం కావాలంటూ నినదించారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. న్యాయస్థానం నిర్ణయం బాద కలిగించిందని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరులు తర్వాత చేపట్టాల్సిన చర్యలపై న్యాయ నిపుణులతో చర్చించారు.



# కష్టపడితేనే లక్ష్యం దగ్గరవుతుంది

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- డాక్టర్ సీటు సాధించిన పోలీస్ పిల్లలకు అభినందనలు

**వరంగల్ వాయిస్, క్రైం :** విద్యార్థులు కష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యం దగ్గరవుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ఎంబీబీఎం సీటు సాధించిన పోలీస్ పిల్లలను గురువారం ఆయన ఘనంగా సత్కరించారు. కొద్ది రోజుల క్రితం ఎంబీబీఎస్ మొదటి విడత కౌన్సిలింగ్ లో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా కుమార్తె తాన్య సభ హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో సీటు సాధించగా, హోంగార్డ్ బాలకిషన్ కుమారుడు ముప్పా చందుకు మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల, మరో హోంగార్డ్ మోహన్ కుమార్తె భవాని ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నప్పటికీ పిల్లల చదువు పట్ల అశ్రద్ధ వహించవద్దన్నారు. వారు ఉన్నత చదువులు చదివే విధంగా ప్రోత్సాహించాలన్నారు. తమ పిల్లలు ఎంబీబీఎస్ సీటు సాధించేందుకు కృషి చేసిన తల్లిదండ్రులను పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అడిషనల్ డీసీపీలు శ్రీనివాస్, ప్రభాకర్ రావు, ఏసీపీ నాగయ్య, ఆర్ఐ చంద్రశేఖర్ తో హోం గార్డ్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాల్లో కలెక్టర్

□ స్వీకరణను పరిశీలించిన డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ను అనుసరిస్తూ వరంగల్ జిల్లాలో తొలి విడత ఎంపీటీసీ, జడ్ పీటీసీ స్థానాలకు రిటర్నింగ్ అధికారులు గురువారం నోటిఫికేషన్ లు జారీ చేసి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వరంగల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలైన గీసుగొండ, సంగెం, పర్వతగిరి, వర్ధన్నపేట, రాయపర్తి, జడ్పీటీసీ స్థానాలతో పాటు, పై మండలాల పరిధిలోని 64 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో గీసుగొండ మండల కేంద్రం లోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలు, అవసరమైన అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. హెల్ప్ డెస్క్, వీడియోగ్రఫీ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై ప్రదర్శించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్ లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని ఆర్ఓలకు సూచించారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా



అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, ఎంపీడీఓ కృష్ణ వేణి, తహసీల్దార్ రియజోద్దీన్ స్థానిక అధికారులు ఉన్నారు.

**జిల్లాకు చేరుకున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు..**

స్థానిక ఎన్నికల నేపథ్యంలో వరంగల్ జిల్లాకు సాధారణ పరిశీలకులు శృతి ఓఝా, వ్యయ పరిశీలకులు డి.శ్రీనివాస్ గురువారం చేరుకోగా వారికి స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పుష్ప గుచ్చాలను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది శిక్షణ , ఎస్ఎస్ టీ, చెక్ పోస్టుల ఏర్పాటు, బ్యాలెట్ బాక్స్ లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సజావుగా పోలింగ్ నిర్వహణకు తీసుకొంటున్న చర్యలు, శాంతి భద్రతలు, ఎన్నికల వ్యయ, తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీపీఓ కల్పన, ఎన్నికల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 42 వ డివిజన్ లో ఓటు చోరీపై సంతకాల సేకరణ

□ ప్రారంభించిన కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్

వరంగల్ వాయిస్, కరీమాబాద్ : కాంగ్రెస్ పార్టీ అధినాయకులు రాహుల్ గాంధీ ఓటు చోరీపై దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్నారని దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇందులో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తున్నారని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ అన్నారు. గురువారం 42 వడివిజన్ రంగసాయిపేటలోని బొడ్రాయి సెంటర్ వద్ద ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ మురళీధర్ రావు ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్ సూచన మేరకు గురువారం 42వ డివిజన్ లో ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఓటు చోరీపై ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేడల పద్మ జనార్ధన్, డివిజన్ అధ్యక్షులు ఏలుగు సాంబేశం, డివిజన్ నాయకులు బొలుగొడ్డు అనిల్, జింక రమేష్, కర్ర కుమార్, మజ్జిగ తిరుమల్, వనం వేణు, శంకేసి అనిల్, ఆవునూరి కుమార్, విలాసాగరం శ్రీనివాస్, పాలకుర్తి సుమన్, బండ్ల ప్రవీణ్, మునుకుంట్ల చంద్రమౌళి, సయ్యద్ బషీర్, విలాసాగరం సంధ్య, కందగట్ల మమత, చిట్ల హేమలత, కానుకంటి పద్మ, బక్కీ కల్పన, బజ్జూరి నిర్మల, వనం లావణ్య, దామెరుపుల రజిత, చిట్ల సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

**• కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశం**

**వరంగల్ వాయిస్, జనగామ :** స్థానిక సంస్థల ఎన్నికల కోసం జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో, జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా షేక్ అధికారులను అప్రమత్తం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్ ప్రక్రియ సజావుగా, ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. గురువారం కలెక్టర్ ముందుగా జడ్పీ కార్యాలయాన్ని, ఆ తర్వాత లింగాల ఘనపురం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ ప్రక్రియ కోసం చేసిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. లింగాల ఘనపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని, నోటిస్ ప్రదర్శన విధానాన్ని పరిశీలించారు. హెల్ప్ డెస్క్‌లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు వారి విధుల్లో ఉన్న అవగాహనను తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో ఆర్వో, ఏఆర్వోలు ఏమేమి తనిఖీ చేయాలో వివరించారు. జిల్లాలో మొదటి విడతలో ఆరు మండలాల్లో (చిల్పూర్, కొడకండ్ల,



పాలకుర్తి, స్టేషన్ఘన్పూర్, దేవరుప్పుల, లింగాల ఘనపురం) 6 జడ్పీటీసీ, 70 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు మూడు రోజుల పాటు జరుగుతుంది. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, అభ్యర్థులు తమ సందేహాలను అక్కడ నివృత్తి చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ మాధురి షా, డిప్యూటీ సీఈఓ సరిత, లింగాల ఘనపూర్ తహసీల్దార్, ఎంపీడీఓ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు చోరీపై సంతకాల సేకరణ



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** కాంగ్రెస్ పార్టీ అధినాయకులు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటు చోరీపై ఉద్యమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని, ప్రజలందరినీ భాగస్వాములను చేస్తున్నట్లు 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ తెలిపారు. గురువారం రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ మురళీధర్ రావు ఆదేశం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్ సూచన మేరకు 42వ డివిజన్, రంగసాయిపేటలోని బొడ్రాయి సెంటర్ వద్ద ఈ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ మాజీ కార్పొరేటర్ కేడల పద్మ జనార్ధన్, డివిజన్ అధ్యక్షులు ఏలుగు సాంబేశం మరియు పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఓటు చోరీపై ప్రజల నుండి మంచి స్పందన లభిస్తోందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొలుగొడ్డు అనిల్, జింక రమేష్, కర్ర కుమార్, మజ్జిగ తిరుమల్, వనం వేణు, శంకేసి అనిల్, ఆవునూరి కుమార్, విలాసాగరం శ్రీనివాస్, పాలకుర్తి సుమన్, బండ్ల ప్రవీణ్, మునుకుంట్ల చంద్రమౌళి, సయ్యద్ బషీర్ తో పాటు మహిళా నాయకులు విలాసాగరం సంధ్య, కందగట్ల మమత, చిట్ల హేమలత, కానుకంటి పద్మ, బక్కీ కల్పన, బజ్జూరి నిర్మల, వనం లావణ్య, రజిత, చిట్ల సంధ్యారాణి పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే నాగరాజు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నాగరాజు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 55వ డివిజన్ పరిధిలోని సదానందం కాలనీ అధ్యక్షుడు పోరిక శ్యామ్ – రుక్మిణి కుమారుడు సందీప్ – ఆశ ల వివాహ విందులో పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం ప్రసాద్, కొంక హరిబాబు, గడ్డం అరుణ్, హసన్ పర్తి మండల పార్టీ అధ్యక్షుడు వీర సుధాకర్, సుమంత్ యాదవ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ

### బీజేపీలో చేరిన బండి రవికుమార్



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన అధికార కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండి రవికుమార్, కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇస్తూ బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు, పరకాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి డా. పగడాల కాళీ ప్రసాద్ రావు బండి రవికుమార్‌కు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎరుకల దివాకర్, మాజీ మండల అధ్యక్షులు గోగుల రాజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తిప్పారపు సుధీర్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ యాదవ్, ధనుంజయ్, స్కై విద్యాసంస్థల చైర్మన్ కుమార్ యాదవ్, తాళ్లపల్లి హరికృష్ణ, శక్తి కేంద్ర ఇంచార్జి జవ్వాజి రమేష్ పాల్గొన్నారు.

## ఎర్రోళ్ల విజయ్య మృతికి పెద్ది నివాళి



**వరంగల్ వాయిస్, సిద్దిపేట :** మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజయ్య అనారోగ్యంతో గురువారం ఉదయం చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత, నర్సంపేట మాజీ శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డి గంగాపూర్‌కు చేరుకున్నారు. ఆయన విజయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కేదాసి మోహన్‌కు జడ్పీటీసీ టికెట్ ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఉద్యమకారుడు కేదాసి మోహన్ మాదిగకే గీసుకొండ మండల జడ్పీటీసీ కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, కేదాసి మోహన్ సమ సమాజం కోసం నిరంతరం పోరాడుతున్నాడని, ఆయన ప్రశ్నించే గొంతుకగా నిలుస్తున్నాడని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా, గత అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేశారని గుర్తు చేశారు. కేదాసి మోహన్‌కు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే, సామాజిక దళిత ప్రజాసంఘాలన్నీ కలిసి భారీ మెజార్టీతో గెలిపిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వెంటనే దృష్టి సారించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజాసంఘాల నాయకులు మోరే ఐలయ్య, కల్వల చంద్, స్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన భూపాలపల్లి డీఎస్పీ



**వరంగల్ వాయిస్, టేకుమట్ల :** స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా, భూపాలపల్లి జిల్లా డీఎస్పీ సంపత్ రావు టేకుమట్ల ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ, పోలీస్, పంచాయతీ రాజ్, పోలింగ్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మల్లికార్జున లేజర్ ఐ స్కిన్ కేర్ ఆస్పత్రి (వరంగల్) సౌజన్యంతో హనుమకొండలోని సాయిబాబా మందిరంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 121 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది రాజు, ప్రవీణ్ లు రోగులకు వివిధ పరీక్షలు చేసి, కంటి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్, మందిర సిబ్బంది సాయి, రాజు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**◆ ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు**

**వరంగల్ వాయిస్, పరకాల :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాలలోనూ రాణించాలని పరకాల మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు పిలుపునిచ్చారు. రాష్ట్ర, దేశ స్థాయిలో ఉత్తమ క్రీడాకారులకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు కూడా ఉంటాయని ఆయన తెలిపారు. పరకాల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఎస్. రమాదేవి అధ్యక్షతన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 14 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలకు మండల స్థాయి కబడ్డీ, ఖో–ఖో క్రీడల ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ఒక ప్రకటన చేశారు. జిల్లా స్థాయిలో పాల్గొనే క్రీడాకారులకు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఉచితంగా టీ



షర్టులు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ పెడరేషన్ పరకాల మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.సాంబయ్య నోడల్ అధికారి నామాని సాంబయ్య, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సురేందర్, మధు భాస్కర్ ,పీడీలు శ్యాం, రజిత, వినయ్, సుధీర్, రాజు, శ్రీకాంత్, సురేష్ మండల పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, పీఈటీలు పాల్గొన్నారు

# వాగ్దేవి కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు ఓరియంటేషన్



**వరంగల్ వాయిస్, నయీం నగర్ :** నయీం నగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ఓరియంటేషన్, ఇండక్షన్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 14 వరకు జరుగుతుందని కళాశాల ఎంబీఏ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. కృష్ణమాచారి తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ కమలాకర్ గంటి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ఉద్యోగాలు వెతుక్కునేవారుగా కాకుండా, జాబ్ క్రియేటర్స్‌గా ఎదగాలని, ఇంప్లిసిట్ (పరోక్ష) మరియు ఎక్స్‌ప్లిసిట్ (ప్రత్యక్ష) నాలెడ్జ్ గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. శుభం ఆయిల్స్ వ్యవస్థాపకులు వినోద్ గోయల్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను జీవితంలో ఒక భాగంగా భావించి, దానిని సాధన చేయడం ద్వారా జ్ఞానాన్ని పొందాలని విద్యార్థులకు హితవు పలికారు. ఎంబీఏ ఫార్మర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. రాజిరెడ్డి విద్యార్థులు మేనేజీరియల్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ ఐదు రోజుల ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా, వివిధ కంపెనీల వ్యవస్థాపకులు మరియు రిసోర్స్ పర్సన్స్‌ను ఆహ్వానించి, విద్యార్థులకు వివిధ మేనేజ్‌మెంట్ రంగాల్లో నైపుణ్యతను పెంచే విధంగా కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ ఎస్. మహేందర్ కుమార్ తెలిపారు. కళాశాల ఫౌండర్ డాక్టర్ సీహెచ్. దేవేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీహెచ్.వాహిని దేవి ఈ సందర్భంగా నూతనంగా చేరిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.శేషాచలం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.హరేందర్ రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రాజాప్రసాద్, సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజేఐ గవాయిపై దాడి సరికాదు



**వరంగల్ వాయిస్, చిట్యాల :** భారతదేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీ.ఆర్. గవాయిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ దాడిని పార్లమెంట్‌పై, భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలందరూ ఏకమై కులరక్కసిని అంతమొందించడానికి అంబేద్కర్ చూపిన మార్గంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సీనియర్ కౌన్సిలర్ అయిన లాయర్ రాకేష్ కిషోర్‌ను కోర్టు నుంచి శాశ్వతంగా బహిష్కరించాలని, క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని సంఘం డిమాండ్ చేసింది. ఈ సంఘటనకు పూర్తి బాధ్యత వహించి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా తమ పదవులకు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.
తమ డిమాండ్లు నెరవేరకపోతే, దళిత, బీసీ, ఎస్టీ, మైనారిటీ సంఘాలతో పాటు ఇతర సంఘాలు ఏకమై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం మండల సాంస్కృతిక కార్యదర్శి దాసారపు నరేష్, నాయకులు, అంబేద్కర్ వాదులు గడ్డం సదానందం, బంజర్ల రవీందర్, ధర్మ సమాజ్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నేరెళ్ల రమేష్, నేరెళ్ల చేరాలు, గిన్నారపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు చోరీతోనే బీజేపీ అధికారంలోకి వచ్చింది



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓటు చోరీ చేసి, ఈవీఎంలను టాంపరింగ్ చేయడం ద్వారానే బీజేపీ జాతీయ స్థాయిలో అధికారంలోకి వచ్చిందని వరంగల్ కాంగ్రెస్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం శివనగర్ 34వ డివిజన్‌లో కాంగ్రెస్ అధ్యక్షులు చిట్టీమల్ల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'చోరీ ఓటుకు వ్యతిరేక' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ అన్ని రాష్ట్రాల్లో ఎన్నికలలో అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోంచి దించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు రావుల విజయరాంచందర్, రంగరాజు వినయ్, పట్టూరి సుధాకర్, బేతి రంజిత్, శెట్టి రాజేష్, కొర్రపాటి రాధిక, వెంకన్న, రాజు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వైష్ణవి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్‌లో శనివారం నుంచి జరగనున్న అండర్–19 జూనియర్ కళాశాలల రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌కు ఏబీవీ జూనియర్ కాలేజ్ విద్యార్థిని వైష్ణవి ఎంపికైంది. వైష్ణవి కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతోంది. వైష్ణవి సాధించిన ఘనతకు గాను, కళాశాల సెక్రటరీ డాక్టర్ చందా విజయ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ విజేందర్ రెడ్డి ఆమెను సన్మానించి, ప్రోత్సాహకంగా వెయ్యి రూపాయల నగదు అందజేశారు. కళాశాల సిబ్బంది అనిత, సంజీవ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసరావు, శ్రీధర్, శ్రీనివాస్, చండీశ్వర్, ఫిజికల్ డైరెక్టర్ బరుపాటి గోపి విద్యార్థిని వైష్ణవిని అభినందించారు.

## కేయూలో 40 రోజుల స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సు

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ ఆధ్వర్యంలో 40 రోజుల పాటు సాగే "స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్" కోర్సు ఈ నెల అక్టోబర్ 15 నుంచి ప్రారంభమవుతుంది. ఆసక్తిగల అభ్యర్థులు అక్టోబర్ 13 లోపు ఫీజు చెల్లించి, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కేయూ సెల్ డాక్టర్ ఆర్. మేఘనా రావు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు రూ.200, బోధనేతర సిబ్బంది, ఇతర విద్యార్థులు, గృహిణులు, ఇతరులు రూ. 1500 ఫీజును ప్రిన్సిపాల్ నాన్ యూనివర్సిటీ ఫండ్‌లో చెల్లించాలి.

## ఘనంగా 'పోషణ మాసం'



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాలు 1, 2, 3, 4లలో గురువారం 'పోషణ మాసం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ హేమలత పర్యవేక్షించారు. ఆమె పోషణ మాసం ప్రాముఖ్యతను వివరించి, అందరితో కలిసి పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. చిన్నారుల కోసం ప్రభుత్వం అందించిన, అంగన్‌వాడీ టీచర్లు సొంతంగా తయారుచేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఈ అవగాహన సదస్సును అంగన్‌వాడీ టీచర్లు పి.సంత, కె.సుప్రియ, బి. రజినికుమారి, ఎం.లక్ష్మి, ఆయాలు రాధ, వనజ, ముత్యాలు రమ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు హాజరై విజయవంతం చేశారు.

## జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందించిన ప్రసాద్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగరంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జీఎఫ్) ఆధ్వర్యంలో ఓసీటీలో నిర్వహించిన అండర్–14 బాలబాలికల క్రీడాపోటీలలో దేశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. వరంగల్ జోన్ నుంచి ప్రాతినిధ్యం వహించిన వీరిలో కబడ్డీ పోటీలో ఎస్తేరు రాణి ద్వితీయ స్థానం సాధించింది. ఖో–ఖో పోటీలో భావన ద్వితీయ స్థానం సాధించింది.
ఈ ఇద్దరు విద్యార్థినులు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినుల విజయాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బక్కి వీర సాయి ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ కే.నిశాంత్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ మాట్లాడుతూ బాలబాలికలు క్రీడల్లో మరింతగా రాణించి పాఠశాల పేరును ఉన్నత స్థాయికి తీసుకురావాలని ఆకాంక్షించారు.

## 10న తెలంగాణ బంద్

### బీసీ రిజర్వేషన్ల హైకోర్టు స్టేకు వ్యతిరేకంగా టీఆర్‌పీ పిలుపు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 9ను నిలిపివేస్తూ హైకోర్టు గురువారం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో, దీనికి నిరసనగా శుక్రవారం రాష్ట్రవ్యాప్త బంద్‌కు తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) పిలుపునిచ్చింది. బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ టీఆర్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లబోయిన అశోక్ ముదిరాజ్ నేతృత్వంలో గురువారం ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీఆర్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజనీ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఈ బంద్ కొనసాగుతుందని, దీనిని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. బంద్‌కు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని టీఆర్‌పీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల అధ్యక్షులు, బీసీ ఉద్యోగులు, అడ్వకేట్లు, డాక్టర్లు, ప్రజా సంఘాలు, మేధావులు బంద్ కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు సాధించేంత వరకు ఉమ్మడిగా పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టీఆర్‌పీ నాయకులు పెండల సంపత్ పటేల్, జంగిలి శ్రీనివాస్, పోలు రాజు, పల్లకొండ చందు, మాదం నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి విఘాతం

### కార్పొరేటర్ బసవరాజు కుమారస్వామి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటు చోరీ' పోరాటానికి మద్దతుగా, వరంగల్ 22వ డివిజన్ కార్పొరేటర్ బసవరాజు కుమారస్వామి ఆధ్వర్యంలో గురువారం పోచమ్మైదాన్‌లోని కెమిస్ట్రీ భవన్‌లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బసవరాజు కుమారస్వామి మాట్లాడుతూ ఓటు చోరీ అనేది ప్రజలను మోసం చేసి గెలవడమేనని, ఇది ప్రజాస్వామ్యానికి పూర్తిగా విరుద్ధమని అన్నారు. దొంగ ఓట్ల ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినంత మాత్రాన ప్రజల బలం ఉన్నట్లు కాదని, సక్రమమైన, ప్రజాస్వామ్యహితమైన పద్ధతిలో ఎన్నిక కావడం మాత్రమే నిజమైన ప్రజాస్వామ్యం అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు తమ ఆధార్, ఓటర్ కార్డు సంతకాలతో కూడిన లేఖలను పంపించారు.

# ఫార్మసీ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరిస్తాం

◆ హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తు హామీ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీపీఓఏ) స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో సెంట్రల్ కమిటీ గురువారం సెక్రటేరియట్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీ, హెల్త్, మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్, డా. క్రిస్టినా జడ్ చోంగ్తు ను కలిసింది. ప్రపంచ ఫార్మసిస్ట్స్ దినోత్సవం సందర్భంగా ఆమెను సన్మానించి, ఫార్మసీ ఆఫీసర్ల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అన్ని సమస్యలను పరిష్కరించడానికి సానుకూలంగా స్పందించిన హెల్త్ సెక్రటరీ, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. వినతి పత్రంలో పేర్కొన్న ప్రధాన సమస్యలు 104 సర్వీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పెండింగ్‌లో ఉన్న వేతనాలు త్వరలో చెల్లింపు జరుగుతుందని హెల్త్ సెక్రటరీ శుభవార్త తెలిపారు. దీనికి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి ఆర్థిక అనుమతి వచ్చిందని పేర్కొన్నారు. మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డులో పెండింగ్‌లో ఉన్న 732 ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టులకు సంబంధించి, కోర్టు స్టే ఏమీ లేనందున వెంటనే ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేసి నియామక ఉత్తర్వులు ఇవ్వాలని టీజీపీఓఏ కోరింది. దీనిపై సెక్రటరీ తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఫార్మసీ ఆఫీసర్లకు జీ.ఓ. ప్రకారం 13 సంవత్సరాలు నిండిన వారికి, ఖాళీలు ఉన్నచోట్ల జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్ / చీఫ్ ఫార్మసీ ఆఫీసర్స్ గా ప్రమోషన్లు ఇవ్వడానికి ఆమోదం తెలిపారు. అన్ని పీహెచ్‌సీలలో ముగ్గురు ఫార్మసిస్ట్‌ల పోస్టులు శాంక్షన్ చేయడానికి, నూతనంగా ఏర్పాటు చేసిన 23 జిల్లాల్లో జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టులు శాంక్షన్ చేయడానికి, అలాగే పల్లె/బస్తీ దవాఖానాల్లో ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టులు శాంక్షన్ చేయడానికి టీజీపీఓఏ విజ్ఞప్తి చేసింది. ఈ సమస్యలన్నీ త్రి సభ్య కమిటీ మాజీ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, ఎన్.శివ శంకర్ పరిధిలో ఉన్నాయని, ఆ కమిటీ ద్వారా నిర్ణయం తీసుకుంటామని సెక్రటరీ తెలిపారు. బి.ఫార్మసీ అర్హతతో పాటు న్యూట్రిషన్, డైటీషియన్ డిప్లొమా అర్హతలు ఉన్నవారికి డైటీషియన్ పోస్టులు ఇవ్వాలని చేసిన విజ్ఞప్తిపై సెక్రటరీ సానుకూలంగా స్పందించారు. తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చి, సంబంధిత అధికారులకు ఫైల్‌ను పంపించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఏ.వి. శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. టీజీపీఓఏ తరపున స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్ హెల్త్ సెక్రటరీకి కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే సబబు కాదు




● ఎంసీపీఐ (యూ) తీవ్ర ఖండన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9పై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని యంసీపీఐ (యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ చర్య బహుజన సమాజాన్ని అణిచివేసేందుకు అగ్రవర్ణ ఆధిపత్య శక్తులు చేస్తున్న కుట్రగా ఆ పార్టీ అభివర్ణించింది. యంసీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూసమాజంలో 56శాతం ఉన్న బీసీలకు కేవలం 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కూడా ఆటంకాలు కల్పించడం అన్యాయమన్నారు. అగ్రవర్ణ పేదల కోసం తెచ్చిన 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోటాతో కలిపి మొత్తం రిజర్వేషన్లు 60శాతం సుప్రీంకోర్టు సీలింగ్‌ను దాటినా, బీసీ రిజర్వేషన్ల విషయంలో మాత్రమే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే రావడానికి పాలక కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర దోపిడీ అగ్రవర్ణ ఆధిపత్య పార్టీలందరి పాత్ర ఉందని, ఇది బహుజన సమాజం ఆత్మగౌరవంపై జరుగుతున్న దాడి అని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చితేనే శాశ్వత రక్షణ ఉంటుందని తెలిసినా, దోపిడీ పాలకవర్గాలు ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. బహుజన సమాజం ఆత్మగౌరవాన్ని కాపాడటానికి, యంసీపీఐ (యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ శ్రేణులు అక్టోబర్ 10, 11 తేదీలలో కలిసి వచ్చే బహుజన శ్రామిక వర్గంతో కలిసి ఎక్కడికక్కడ నిరసన ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది.

# అవినీతికి తావు లేకుండా లబ్ధిదారుల ఎంపిక



**వరంగల్ వాయిస్, సుబేదారి :** వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవినీతికి తావు లేకుండా అత్యంత పారదర్శకంగా వ్యవహరించామని స్పష్టం చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి ప్రతీ ఒక్కరూ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ సుబేదారిలోని తన క్యాంప్ కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్‌కు చెందిన 5 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు కీలక విషయాలు వెల్లడించారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో జరగని విధంగా, వర్ధన్నపేట నియోజకవర్గంలో మంజూరైన ఇళ్లలో దాదాపు 90 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. లబ్ధిదారుల ఎంపికలో ఎక్కడా అవినీతి జరగలేదు. ఇందుకు కృషి చేసిన ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, గ్రామ, మండల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. “ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరైనా డబ్బులు ఇచ్చినట్లు తెలిస్తే, ఇల్లు రద్దు చేసి, డబ్బులు తీసుకున్న వారిని జైలుకు పంపిస్తా” అని ఎమ్మెల్యే తీవ్రంగా హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా, వచ్చే మూడేళ్లలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఎక్కడా, ఎవరికీ నయా పైసా కూడా ఇవ్వొద్దని సూచించారు. “మనమంతా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాం. పాత, కొత్త అనే విషయాన్ని మర్చిపోయి పార్టీని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలి” అని నేతలకు దిశానిర్దేశం చేశారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలలో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరే విధంగా మనందరం సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ దోచుకున్న సొమ్మును సోషల్ మీడియాలో పెట్టి కాంగ్రెస్ పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. “లిక్కర్ రాణి” కవిత మళ్లీ తెలంగాణలో దోచుకునేందుకు జాగృతి పేరుతో తెరపైకి వస్తున్నారని విమర్శిస్తూ, తెలంగాణ ప్రజలు వారి మాటలు విని మోసపోవద్దని హెచ్చరించారు. కవిత తన మాటలను అదుపులో పెట్టుకోకపోతే తెలంగాణ సమాజం క్షమించదని అన్నారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి ఫ్యాక్స్ చైర్మన్ చల్ల గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దేవరకొండ అనిల్ కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలి

బకాయిల సాధన కమిటీ డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మార్చి 2024 నుంచి సెప్టెంబర్ 2025 వరకు పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల 18 నెలల పెండింగ్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ బకాయిల సాధన కమిటీ, ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో కమిటీ అధ్యక్షులు ఎస్. ధర్మేంద్ర అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో నాయకులు ఈ డిమాండ్ చేశారు. వక్తలు ధర్మేంద్ర, భోగేశ్వర్, దేవదాసు, మహబూబ్ అలీ, అబ్దుల్ గఫార్, చంద్ర మౌళి మాట్లాడుతూ 18 నెలలుగా బకాయిలు చెల్లించకపోవడం పెన్షనర్లను మానసికంగా వేధించడమేనని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు అందక, రిటైర్డ్ ఉద్యోగులు పిల్లల పెళ్లిళ్లు చేయలేక, ఇళ్లు కట్టుకోలేక, చేసిన అప్పులు, బ్యాంకు ఈఎంఐలు తీర్చలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరోగ్యాన్ని బాగు చేసుకోలేని దయనీయ స్థితిలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 26 మంది రిటైర్డ్ పెన్షనర్లు చనిపోవడం జరిగిందని నాయకులు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు కొంతమందికి బకాయిలు చెల్లించినప్పటికీ, కోర్టుకు వెళ్లని వేలాది మందికి చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 10,000 మంది రిటైర్ అయ్యారని అంచనా వేశారు. 18 నెలల నుండి బకాయిలు చెల్లించకపోవడంతో విసిగి వేసారిన రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యలను సాధించుకోవడం కోసం ఈ రిటైర్డ్ ఎంప్లాయిస్ బకాయిల సాధన కమిటీని ఏర్పాటు చేసుకున్నట్లు నాయకులు వెల్లడించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు ఎస్. ధర్మేంద్ర, ప్రధాన కార్యదర్శి కడారి భోగేశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు కందుకూరి దేవదాసు, ఎం.డీ. మహబూబ్ అలీ, గౌరవ అధ్యక్షులు చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పొగాకు వాడకాన్ని నిషేధిద్దాం

సీకేఎం కళాశాలలో ప్రతిజ్ఞ చేయించిన అధికారులు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం అవేర్‌నెస్ క్యాంపైన్‌ను గురువారం దేశాయిపేటలోని సీకేఎం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ధర్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు మాట్లాడుతూ నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం (ఎన్ టీసీపీ) ముఖ్య ఉద్దేశం ప్రజలలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే సమస్యలపై అవగాహన కల్పించడమేనని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దేశ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లోనే కాకుండా ప్రతి గ్రామ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధూమపానం మానేయడానికి ఇష్టపడని వినియోగదారులకు సరైన సలహాలు ఇవ్వడం కూడా ఈ ప్రోగ్రాం లక్ష్యమని వివరించారు. డాక్టర్ సాంబశివరావు, వైద్య ఆరోగ్యశాఖతో పాటు ఐసీడీఎస్, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్‌ల సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ప్రజలలో అవగాహన పెంచి ధూమపానాన్ని నిరోధించాలని సూచించారు. టొబాకో కంట్రోల్ కార్యక్రమంలో భాగంగా, కళాశాల ప్రిన్సిపాల్ సమక్షంలో పాల్గొన్న విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది అంతా పొగాకు ఉత్పత్తులను, పొగాకు వాడకాన్ని నిషేధిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ వరప్రసాద్, డాక్టర్ కొమురయ్య, డాక్టర్ మోహన్ సింగ్, డాక్టర్ భరత్, స్థానిక డాక్టర్ భరత్ కుమార్, డాక్టర్ విజయపాల్ రెడ్డి, ఎన్సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ సతీష్ కుమార్, అనిల్ కుమార్, సూపర్వైజర్స్, ఎన్సీసీ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబులెన్స్‌ల ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేనేజర్ రాజు నాయక్ గురువారం చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న 108, 102 అంబులెన్స్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన అంబులెన్స్‌లలోని మెడికల్ పరికరాల పనితీరు, ఔషధాల నిల్వ స్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే, గత మూడు నెలల రికార్డులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా మేనేజర్ రాజు నాయక్ సిబ్బందికి (టెక్నీషియన్ నగేష్ కుమార్, పైలెట్ శరత్) పలు సూచనలు చేశారు. ముఖ్యంగా, అంబులెన్స్‌కు కాల్ అందిన వెంటనే వెంటనే స్పందించి బయలుదేరాలని ఆదేశించారు.

# శ్రేసన్ ఫార్మా యజమాని అరెస్ట్




**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా కలకలం సృష్టించిన కోల్డ్‌రిఫ్ దగ్గు మందు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మధ్యప్రదేశ్‌లో ఈ మందు వాడి 20 మంది చిన్నారులు మూత్రపిండాల వైఫల్యం (కిడ్నీ ఫెయిల్యూర్) కారణంగా మరణించిన సంఘటనపై చర్యలు తీసుకున్న మధ్యప్రదేశ్ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), తయారీ సంస్థ యజమానిని అరెస్టు చేసింది. శ్రేసన్ ఫార్మా తయారు చేసిన ఈ దగ్గు మందు తాగి మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 20 మందికి పైగా చిన్న పిల్లలు చనిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. రాజస్థాన్‌లోనూ ఈ మందు వల్ల చాలా మంది చిన్నారులు కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌కు గురై మరణించినట్లు ఆరోపణలు వచ్చాయి. పోలీసులు గురువారం ఉదయం చెన్నైలో శ్రేసన్ ఫార్మా యజమాని రంగనాథన్‌ను అదుపులోకి తీసుకుని, ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలో, ఇప్పటికే దేశంలోని అన్ని రాష్ట్రాలు కోల్డ్‌రిఫ్ దగ్గు మందు వినియోగాన్ని నిషేధించాయి.

# బీసీ రిజర్వేషన్ల స్టేకు బీజేపీనే కారణం

## అధికారం నుంచి గద్దె దించాలి

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన జీవో నెం. 9తో పాటు, ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే విధించడానికి ప్రధాన కారణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఆరోపించింది. బీజేపీ కుట్రల వల్లే రిజర్వేషన్ల అమలు ఆగిపోయిందని ఆ పార్టీ పేర్కొంది. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు, మంత్రులు తక్షణమే నైతిక బాధ్యత వహించి, తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన, సర్వే నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రానికి పంపించినా స్పందించలేదు. శాసనసభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్‌కు పంపించినా ఆమోదించకపోవడం వల్లే ఈ రిజర్వేషన్లు ఆగిపోయాయని ఆరోపించారు. రాష్ట్ర బీజేపీ నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎలాంటి ప్రయత్నం చేయలేదని విమర్శించారు. బీజేపీ కులతత్వ, మనువాద పార్టీ అయినందున, కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలని కోరుకుంటోందని జాన్ వెస్లీ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు రావాల్సిన హక్కులన్నింటినీ బీజేపీ కాలరాస్తోందని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు కావాలంటే, రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీకి పుట్టగతులు లేకుండా చేస్తేనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. సామాజిక న్యాయం కోరే శక్తులు, ప్రజాస్వామికవాదులంతా కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు పోరాటాలకు సన్నద్ధం కావాలని సీపీఐ(ఎం) విజ్ఞప్తి చేసింది. అలాగే, 42 శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధమైన చర్యలన్నీ తీసుకోవాలని డిమాండ్ చేసింది.

# చె గువేరా ప్రతిఘటనకు ప్రతీక




◆ ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** విప్లవ వీరుడు, క్యూబా మాజీ పరిశ్రమల మంత్రి కామ్రేడ్ చె గువేరా 58వ వర్ధంతి సందర్భంగా, అఖిల భారత యువ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు డా. సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ వరంగల్‌లో నివాళులు అర్పించారు. గురువారం పోచమ్మైదాన్ చౌరస్తా వద్ద గల రాణి రుద్రమ దేవి విగ్రహం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. సభను ఉద్దేశించి డా. వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ "తను చనిపోయి దశాబ్దాలు గడిచినా, చె గువేరా ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది అణగారిన ప్రజలకు ప్రతిఘటనకు ప్రతీకగా నిలుస్తూనే ఉన్నాడు" అని అన్నారు. చె గువేరా అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా నిలిచిన విప్లవకారుడు అని, ఆయన శాంతి, న్యాయం, సమానత్వం అనే సిద్ధాంతాల పట్ల ఉన్న అచంచల నిబద్ధత ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిలో పోరాట స్ఫూర్తిని నింపిందని తెలిపారు. 1928 జూన్ 14న అర్జెంటీనాలోని రొసారియోలో జన్మించిన చె గువేరా, వైద్య విద్యార్థిగా లాటిన్ అమెరికా అంతటా పర్యటించి, పేదరికం, అసమానతల పరిస్థితులను స్వయంగా చూశారు. ఈ అనుభవమే ఆయనను ఫిడెల్ కాస్ట్రో నాయకత్వంలోని క్యూబా విప్లవం వైపు నడిపించి, దోపిడీ వ్యవస్థలను నిర్మూలించడానికి విప్లవ మార్గాన్ని ఎంచుకునేలా చేసింది. ఆయన తక్కువ వయసులోనే మరణించినప్పటికీ, ఆయన విప్లవాత్మక ఆత్మ సజీవంగానే ఉందని, తరతరాల యువతలో దోపిడీ వ్యవస్థలను సవాలు చేసే స్ఫూర్తిని నింపుతోందని ఖాద్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కా శుదీర్, నాయకులు ఖాదర్ అలీ, జగదీష్, మతీన్ కకా, మొ.యూసుఫ్, వెంకటేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు టై, బ్యాడ్జీ, బెల్టుల పంపిణీ



**వరంగల్ వాయిస్, చిట్యాల :** చిట్యాలలోని స్థానిక జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు దాతల సహకారంతో టై, బ్యాడ్జీ, బెల్టులను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి రఘుపతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతలు పొగళ్ల మహేందర్ రెడ్డి, దేవ శ్రీధర్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు కూడా సహకరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బొమ్మ రాజమౌళి, బుర్ర సదయ్య, కూచనపల్లి శ్రీనివాస్, పీడీ సూధం సాంబమూర్తి, రామనారాయణ, ఉస్మాన్ అలీ, నీలిమ రెడ్డి, సరళ దేవి, కల్పన, విజయలక్ష్మి, సుజాత, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక–2035 ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం రూపొందించిన 'తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక–2035'ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆవిష్కరించారు. 2035 వరకు ఉద్యాన పంటల ఉత్పత్తిని పెంచడానికి అనుసరించాల్సిన లక్ష్యాలను ఈ ప్రణాళిక నిర్దేశిస్తుంది. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ డి. రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాబోయే ఐదేళ్లలో 1.32 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు, 2.45 లక్షల ఎకరాల్లో కూరగాయల పంటల విస్తీర్ణం, దిగుబడులు, ఉత్పత్తిని పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రణాళిక ప్రకారం, వచ్చే ఐదేళ్లలో సాగు పెట్టుబడిగా రూ.921.40 కోట్లు, డ్రిప్ కోసం రూ.942.50 కోట్లు కేటాయిస్తే, ఒక్క రూపాయి పెట్టుబడికి నాలుగు రూపాయల లాభం పొందే అవకాశం ఉంది. విశ్వవిద్యాలయం రూపొందించిన కొత్త రకాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రస్తుత విస్తీర్ణంలో అమలు చేస్తే, ఏటా రూ.1,341 కోట్ల ఉత్పత్తి విలువను సాధించవచ్చని అంచనా వేశారు. ఈ ప్రణాళిక వివిధ పంటల్లోని మిగులు, ఉత్పత్తి లోటు ప్రాతిపదికన కార్యాచరణను అమలు చేయాలని సూచించింది. మిగులు/లోటు ఉన్న పంటలను గుర్తించి, వాటికి అనుగుణంగా విస్తీర్ణం పెంచడం, ఉత్పాదకత సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం, పంట యాజమాన్యం, మార్కెటింగ్ వంటి అంశాలను సమగ్రంగా వివరించారు. ఈ ప్రణాళిక పుస్తకాన్ని డాక్టర్ డి.రాజి రెడ్డి, డాక్టర్ ఎ.భగవాన్, డాక్టర్ జి.పి. సునందిని రూపొందించారు.

వరంగల్ వాయిస్ సినిమా
గురువారం 09 అక్టోబర్ 2025




# బద్రీనాథ్‌తో 40 కోట్లు బొక్క

## –అల్లు అరవింద్



అల్లు అర్జున్ ఇప్పుడు ఐకాన్ స్టార్ గా ఇండియా రేంజ్ లో దూసుకుపోతున్నాడు. పుష్ప సినిమా తర్వాత ఆయనకు పాన్ ఇండియా మార్కెట్ బాగా పెరిగింది. వందల కోట్ల బిజినెస్ చేస్తోంది ఆయన సినిమా. అయితే ఈ స్థాయిలో బన్నీ సినిమాలు చేస్తుంటే.. ఆయన వల్ల అల్లు అరవింద్ 40 కోట్లు నష్టపోయాడు. బద్రీనాథ్ మూవీ విషయాన్ని అల్లు అరవింద్ స్వయంగా ఓ ఇంటర్వ్యూలో తెలిపాడు. అల్లు అర్జున్ హీరోగా వివి వినాయక్ డైరెక్షన్లో వచ్చిన భారీ బ్జడెట్ మూవీ బద్రీనాథ్. అయితే ఈ సినిమాను ముందు అల్లు అరవింద్ రిజెక్ట్ చేశాడంట. కానీ అల్లు అర్జున్ ఇందులోని యాక్షన్ సీన్స్ కోసం పట్టుబట్టి మరి చేశాడు. ఈ సినిమా రిజల్ట్ ఎందుకో తేడా కొడుతుందని ముందు నుంచి అరవింద్ చెబుతూనే ఉన్నాడంట. సినిమాకు బ్జడెట్ అనుకున్న దానికంటే రెండిరతలు ఎక్కువైంది. అప్పుడున్న బన్నీ మార్కెట్ కుమించి బ్జడెట్ అయింది. రిలీజ్ కి ముందు కూడా అరవింద్ కు ఈ సినిమా గురించి తేడాగానే ఉందని అనిపించింది. అనుకున్నట్టు గానే సినిమా డిజాస్టర్ అయింది. బ్జడెట్ భారీగా ఉండడంతో నష్టాలు ఎక్కువగానే వచ్చాయి. ఆ సినిమాకు ఎంత లేదన్న 40 కోట్ల వరకు నష్టాలు వచ్చాయని అల్లు అరవింద్ స్వయంగా తెలిపాడు. ఆ దెబ్బతోనే చాలా రోజులు పెద్ద సినిమాలు నిర్మించలేదని స్పష్టం చేశాడు. తిరిగి కోలుకోవడానికి కొంచెం టైం పట్టిందని.. కెరీర్ లో ఇలాంటి అనుభవాలు కూడా మంచివే అంటూ తెలిపాడు అరవింద్.



# రామ్‌గోపాల్ వర్మ అంటే ఎవరో తెలీదు




### శివ సినీ పరిశ్రమకు కొత్త దిశను చూపిందన్న శేఖర్ కమ్ముల



ఇండస్ట్రీని 'శివ' సినిమాకు ముందు తర్వాత అని చూడొచ్చని ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. అగ్ర కథానాయకుడు నాగార్జున హీరోగా రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శివ' మరోసారి అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసందే. నవంబర్ 14న ఈ సినిమా రీరిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమా రోజులను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో రామ్ గోపాల్ వర్మ అంటే ఎవరో తనకు తెలియదన్నారు. టాలీవుడ్ చరిత్రలో మలుపుతిప్పిన సినిమాగా గుర్తింపు పొందింది 'శివ'. నాగార్జున హీరోగా, రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగు సినీ పరిశ్రమకు కొత్త దిశను చూపింది. 1989లో విడుదలైన ఈ సినిమా, సాంకేతికంగా, కథా పద్ధతిలో, మేకింగ్‌లో విప్లవాత్మక మార్పులను తెచ్చింది. యాక్షన్ చిత్రాలకే కాదు, కాలేజీ డ్రామాలకు కూడా రియలిస్టిక్ టచ్ ఇచ్చిన మొదటి తెలుగు సినిమా ఇది అని సినీ అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. ఇప్పుడు ఈ లెజెండరీ సినిమా మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. నవంబర్ 14న 'శివ' రీ`రిలీజ్ అవుతున్న సందర్భంగా ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని గురించి తన భావాలను పంచుకున్నారు. 'అప్పట్లో రామ్ గోపాల్ వర్మ అంటే ఎవరో నాకు తెలియదు. కానీ 'శివ' సినిమా చూశాక సినిమా అంటే ఏమిటో, దాన్ని ఎలా ఆలోచించాలో అర్థమైంది. ఆ సినిమా నా దృష్టి, నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసింది' అంటూ కమ్ముల పేర్కొన్నారు. ఆయన చెప్పిన ఈ మాటలు ఆ సినిమాకు ఉన్న ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేస్తున్నాయి. రియలిస్టిక్ సినిమాలకు పేరుగాంచిన శేఖర్ కమ్ముల దృష్టిలో 'శివ' కేవలం ఒక సినిమా కాదు, అది ఒక పాఠశాల లాంటిదట. ఈ సినిమా ప్రభావం తన దర్శకత్వ శైలిలో కూడా కనిపిస్తుందని తెలిపారు.

# త్రివిక్రమ్, వెంకీ కాంబో

### హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్



నువ్వు నాకు నచ్చావ్ సినిమా తర్వాత వెంకటేశ్ , త్రివిక్రమ్ శ్రీనివాస్ క్రేజీ కాంబోలో ఫుల్ లెంగ్త్ సినిమా రాబోతుందని తెలిసిందే. ఇటీవలే గ్రాండ్‌గా లాంచ్ అయిన ఈ మూవీ త్వరలోనె సెట్స్‌పైకి వెళ్లనుంది. అయితే కొన్నాళ్లుగా సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్లుగా రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్, ఎస్ థమన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కానీ త్రివిక్రమ్ మాత్రం ఈ సారి రెగ్యులర్ మ్యూజిక్ కంపోజర్లు కాకుండా కాస్త రూటు మార్చబోతున్నాడట. ఈ చిత్రం కోసం మ్యూజిక్ లవర్స్‌కు మరింత నయా ఫీల్ అందించేందుకు యానిమల్ కంపోజర్‌ను తెరపైకి తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాడని వార్తలు వస్తున్నాయి. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ పేరును పరిగణనలోకి తీసుకుంటున్నాడని ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. పాన్ ఇండియా మూవీ లవర్స్‌ను ఎంటర్‌టైన్ చేసేలా ఆల్బమ్‌ను చేస్తున్నట్టు తాజా వార్తలు హింట్ ఇచ్చేస్తున్నాయి. మరి వెంకీ కోసం హర్షవర్ధన్ రామేశ్వర్ ఎలాంటి బీజీఎం, మ్యూజిక్ ఆల్బమ్ రెడీ చేశాడనేది చూడాలి.

# ప్రేమంటే మూవీ నుంచి దోచావే పాట విడుదల



ప్రియదర్శి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ప్రేమంటే'. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఆనంది హీరోయిన్‌గా నటిస్తున్నారు. సుమ కనకాల కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'దోచావే నన్నే నువ్విలా..' అనే పాటను విడుదల చేశారు. ఈమెలోడీ పాటకు శ్రీమణి లిరిక్స్ అందించారు.

# మెరుగైన వైద్యానికి వెల్‌నెస్ సెంటర్లు

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- సీజీహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ రోహిణితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా నూతనంగా వెల్నెస్ సెంటర్ ఏర్పాటు జరుగుతోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. గురువారం వరంగల్ విచ్చేసిన సీజీహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ రోహిణితో కలిసి పలు ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) వెల్నెస్ సెంటర్ స్థాపనకు కృషి చేస్తున్న కడియం కావ్య ఇటీవల కలెక్టర్, వరంగల్ మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులతో కలిసి పలు భవనాలను పరిశీలించి, ఎంపిక చేసిన భవనాల వివరాలను హైదరాబాదులోని సీజీహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ రోహిణికి తెలియజేశారు. సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనాల ఎంపికను త్వరితగతిన పూర్తి చేయాలని సీజీహెచ్ఎస్ డైరెక్టర్‌కి సూచించారు. ఈ మేరకు సీజీహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ రోహిణి గురువారం హనుమకొండ చేరుకుని ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి పలు ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. హనుమకొండలోని కాజీపేట డివిజన్ మున్సిపల్ కార్యాలయం, దూరదర్శన్ కార్యాలయంతో పాటు వసతి గృహం, వరంగల్ పాత కలెక్టర్ వసతి గృహం, కుడా కార్యాలయాలను సందర్శించి వాటి స్థితిగతులు, సౌకర్యాలు, విస్తీర్ణం వంటి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కడియం కావ్య అధికారులు, ఇంజనీర్లతో కలిసి సెంటర్‌కు అవసరమైన మౌలిక వసతులపై చర్చించారు. భవనం ఎంపిక ప్రక్రియను తక్షణం పూర్తి చేసి సెంటర్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని సీజీహెచ్ఎస్ అధికారులకు ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. తరువాత హనుమకొండలోని కనకదుర్గ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో పెన్షనర్లు కడియం కావ్యను కలిసి సీజీహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ మంజూరుకు చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే భవనాల పరిశీలనకు సీజీహెచ్ఎస్ డైరెక్టర్ తో ముందడుగు వేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, సీజీహెచ్ఎస్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మండలాల వారీగా బీజేపీ ఇంచార్జులు

- ఆదేశాలు జారీ చేసిన జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ అడుగులు వేస్తోంది. రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం వ్యవహరిస్తూ పావులు కదుపుతున్నారు. ఈ మేరకు వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గంట రవికుమార్ గురువారం వరంగల్ జిల్లా పరిధిలోని మండలాల వారీగా ఎన్నికల ఇంచార్జులను నియమించారు. వీరు స్థానికంగా పార్టీ పటిష్టతకు కృషి చేయనున్నారు. అదే విధంగా ఎన్నికల్లో విజయం సాధించేందుకు కావాల్సిన అభ్యర్థులు ఎంపికతోపాటు ఇతర అన్ని అవసరాలను వీరు చూసుకోనున్నారు. బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ గురుమూర్తి శివకుమార్ ను హసన్ పర్తి మండల ఇంచార్జిగా నియమించారు. అదే విధంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు ముత్తిరెడ్డి కేశవరెడ్డిని ఐనవోలు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ వన్నాల వెంకటరమణను వర్ధన్నపేట, స్టేట్ ఎగ్జిక్యూటివ్ ఎర్రబెల్లి ప్రదీప్ రావును పర్వతగిరి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కుసుమ సతీష్ బాబును నర్సంపేట, స్టేట్ కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నర్సింహులును దుగ్గొండి, బీజేపీ స్టేట్ లీడర్ సముద్రాల పరమేశ్వర్ ను నెక్కొండ, స్టేట్ ఎగ్జిక్యూటివ్ రత్నం సతీష్ షాను ఖానాపూర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు కంబంపాటి పుల్లా రావ్ ను చెన్నారావుపేట, జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డిని నల్లబెల్లి మండలానికి ఇంచార్జిగా నియమిస్తూ గంట రవికుమార్ ఆదేశాలు జారీ చేశారు. వీరు ఆయా మండలాల్లో పర్యటించి బీజేపీ నాయకులను సంఘటితం చేయడంతోపాటు గ్రామాల్లో కాషాయ జెండా ఎగురవేసేందుకు కృషి చేయనున్నారు..



# దురదృష్టకరం

- రిజర్వేషన్ సాధ్యం కాదని బీఆర్ఎస్ ముందే చెప్పింది రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బీసీ రిజర్వేషన్ల పెంపు జీవోను హైకోర్టు కొట్టివేయడం తీవ్ర విచారకరం, దురదృష్టకరమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు. చట్టసభలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు జరగాలంటే పార్లమెంటులో చట్టం చేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ నందు పొందుపర్చిన తర్వాతే సాధ్యపడుతుందని బీఆర్ఎస్ మొదటి నుంచి చెబుతుందన్నారు. అయినప్పటికీ రేవంత్ రెడ్డి సర్కార్ అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టిన సందర్భాలలో మద్దతివ్వడం జరిగిందన్నారు. ఎంపీ రవిచంద్ర మాజీ మంత్రులు గంగుల కమలాకర్, వి.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ తదితర ప్రముఖులతో కలిసి గురువారం సాయంత్రం హైదరాబాద్ తెలంగాణ భవన్ లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన 'ఆపరేషన్ సక్సెస్, పేషంట్ డెడ్' అనే చందంగా కాంగ్రెస్ వ్యవహారం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో ఎలాగైనా బీసీల ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి రావాలనే కుట్ర, కాంక్షతోనే కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రచారం కోసమే బీసీ అస్త్రాన్ని ప్రయోగించి ఉపయోగించుకున్నదని చెప్పారు. బీసీ బిడ్డలంతా ఏకతాటిపైకి వస్తున్నారని, తమకు జరుగుతున్న అన్యాయాలపై తిరుగుబాటు తప్పదని ఎంపీ వద్దిరాజు హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శుభప్రద పటేల్, కురవ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



(అక్టోబర్ 10 ,ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా)

# మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం

మన ఆలోచనలు, ఆచరణలూ అన్నీ మెదడుపైనే ఆధారపడి ఉంటాయి. మెదడే గనుక లేకుంటే ఇంజన్ లేని రైలు, దారంలేని గాలిపటం అవుతుంది. మన కర్తవ్యాలను నెరవేర్చుకుంటూ, లక్ష్యాలను చేరి, ఆనందంగా జీవించేందుకు ఇతర శారీరక అవయవాలతోబాటు మానసిక ఆరోగ్యం సంతృప్తికరంగా ఉండేలా చూసుకోవాలి. ఆ అవగాహన ఏర్పర్చుకోడానికి, అప్రమత్తంగా ఉండటానికి, అవసరమైన ప్రణాళికలు రచించుకోడానికి, జాగ్రత్తలేంటో తెలుసుకుని పాటించడానికి ఉద్దేశించినదే ఈ ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం. ప్రపంచ వ్యాప్తంగా మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన పెంచడానికి, ప్రజలను చైతన్యపరచడానికి, మానసిక రుగ్మతలకు సంబంధించిన వివక్షను తగ్గించడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈరోజున ప్రజల్ని అప్రమత్తం చేసేందుకు చర్చలు జరపడం,సెమినార్లు నిర్వహించడం, మెంటల్ డిజార్డర్లేమీ చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మానసిక వైకల్యంతో బాధపడుతున్నవారికి చికిత్స లాంటివన్నీ ఏర్పాటు చేస్తారు. మానసిక అనారోగ్యాన్ని అశ్రద్ధ చేసినా, చికిత్స మధ్యలో ఆపేసినా పరిస్థితి మరింత అదుపుతప్పే ప్రమాదం వుంది. శారీరక, మానసిక ఆరోగ్యాలు ఒకదానిపై ఒకటి ఆధారపడివుంటాయి. దీర్ఘకాలిక శారీరక సమస్యలు కొన్నిసార్లు మెదడుపై ప్రభావం చూపుతాయి. అలాగే మానసిక దౌర్బల్యం శారీరకంగా క్షీణింపచేస్తుంది. కనుక అటు శారీరకంగానూ, ఇటు మానసికంగానూ దృఢంగా ఉండేట్లు చూసుకోవాలి. అప్రమత్తంగా ఉండేందుకు అవసరమైన అంశాలను తెలుసుకోవాలి. 150 దేశాల మానసిక ఆరోగ్య కేంద్రాల సభ్యుల సలహా, సహకారాలతో 1992లో తొలిసారి వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ ప్రోద్బలంతో ఈ దినాన్ని జరుపుకోవడం మొదలుపెట్టారు.

వైద్య పరిభాషలో డిప్రెషన్, యాంగ్జయిటీ, యాంగ్జయిటీ న్యూరోసిస్, బైపోలార్ డిజార్డర్, సోషల్ యాంగ్జయిటీ డిజార్డర్, పానిక్ డిజార్డర్, అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్, పోస్ట్ ట్రామటిక్ స్ట్రెస్ డిజార్డర్, ఫోబియా, మానియా, స్కిజోఫ్రీనియా, డిల్యూషనల్ డిజార్డర్, స్లీప్ డిజార్డర్ (ఇన్‌సోమ్నియా), ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్, సుపీరియారిటీ కాంప్లెక్స్, ఇల్యూషన్, అడిక్షన్ లాంటి మానసిక వైకల్యాలు అనేకం ఉన్నాయి. స్థూలంగా చెప్పాలంటే మానసిక ఉద్రేకాలను నిగ్రహించు కోలేకపోవడమే రుగ్మతను తెచ్చిపెడ్తుంది. కష్ట సమయాలు, క్లిష్ట పరిస్థితుల్లో కుంగిపోకుండా బ్యాలెన్స్‌డ్‌గా ఉండగల్గితే మెదడు సక్రమంగా పనిచేస్తుంది. కనుక వత్తిడికి గురికాకుండా సమస్య పరిష్కార దిశగా ఆలోచిస్తే మానసిక ఆరోగ్యం బాగుంటుంది. ఆందోళన, వత్తిడి అనేవి డిప్రెషన్‌కు దారితీస్తాయి కనుక ముందుగా వాటికి చెక్‌పెట్టమని హితవు చెప్తున్నారు. కలతపరిచే ఆలోచనలు, చేటుచేసే చేష్టలు మానుకుంటే మానసిక రుగ్మతలేవీ దరిచేరవు. తగుమోతాదులో పౌష్టికాహారం, రోజులో కనీసం గంట సేపు వ్యాయామం, శక్తికి మించిన అలసట, దుర్భరమైన నొప్పి లేకుండా చూసుకోవడం, రిలాక్సేషన్ ఎక్సర్‌సైజులు, తీవ్ర ఉద్రేకాలకు లోనుకాకుండా, కుంగిపోకుండా ఉండాలి. లోకంలో పరిష్కారం లేని సమస్యంటూ గుర్తించి, ప్రయత్నిస్తే ఆందోళనే ఉండదు ఈపాటి జాగ్రత్తలు పాటించినట్లయితే మానసిక రుగ్మతలు దరిచేరవని హామీ ఇస్తున్నారు.



**పోగు అశోక్,**
**- జనరల్ సెక్రటరీ ఆఫ్ తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్**

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com